క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు, పాలక వర్గ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా వాసవీ హోమం



వాసవీ హోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: వాసవీ శాంతి ధాంలో ఆదివారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్ణాటక నుంచి వచ్చిన వాసవీ భక్తులు కేఆర్ ప్రదీప్ ఆధ్వర్యంలో 16 మంది దంపతులు ఉదయం నుంచి గోమాత పూజల, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు ఆలయ అర్చకులు శిష్టా మణికంఠ పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. అనంతరం 102 రుషీ గోత్ర మందిరంలోని పంచలోహ వాసవీ మాత విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుగొండ: మండలంలోని మానేవారి పాలెం నుంచి వంకతాళ్ల చెరువుకు రూ.1.08 కోట్లుతో చేపట్టబోయే రహదారి నిర్మాణానికి మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో వరద ఉధృతిని ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీ ఎర్రగొప్పుల నాగరాజు గొడవర్తి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కళా రంగాలకు ప్రోత్సాహం

కళా, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి పెనుగొండ త్యాగరాజ కళాభవనంలో నిర్వహించిన 40వ సంగీతోత్సవంలో పాల్గొని చిన్నారులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, పితాని అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

వేణుబాబుకు మానవత సభ్యుల పరామర్శ



ఆదిలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

పెనుమంట్ర: మార్టేరు గ్రామ ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి దంపతులను ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యులు పరామర్శించారు. వేణుబాబు తల్లి ఆదిలక్ష్మి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పెనుమంట్ర మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వేణుబాబు నివాసానికి వెళ్లి ముందుగా ఆదిలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస మురళీకృష్ణ, చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, కో-చైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం: పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన వెన్నంశెట్టి లక్ష్మణరావు, లక్ష్మి దంపతులు 24 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, ఈఓ బుద్ధ మహాలక్ష్మి నగేష్, సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోదావరీ

- ఉధృతంగా గోదావరి వరద
- లంకల్లోకి ప్రవేశించిన వరద నీరు
- రైతన్నల గగ్గోలు

పెనుగొండ: వశిష్ఠ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో సిద్ధాంతం మధ్యస్థలంకలోని కూరగాయల తోటలన్నీ నీట మునిగాయి. ఆచంట మండలం లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. సిద్ధాంతం కేదారీ ఘాట్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. ప్రజలు ఎవరూ కేదారీఘాట్‌లోకి రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మధ్యస్థలంకలోకి రాకపోకలు నిలిపివేయాలంటూ రైతులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరద మరికొంత పెరిగితే మధ్యలంకలో ఉన్న పశువులను ఏటిగట్టుపైకి తీసుకురావాలని సూచించారు. పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు. కేదారీఘాట్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోకి నీరు ప్రవేశించింది. నీటి ప్రవహం మరింత పెరిగితే కేదారేశ్వర స్వామి ఆలయంలోకి నీరు ప్రవేశించే అవకాశం ఉంది. సిద్ధాంతంలో గోదావరి వరద ఉధృతిని తహసీల్దార్ రోహిణీ దేవి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర తదితరులు పరిశీలించారు.

నరసాపురంలో పెరుగుతున్న గోదావరి

నరసాపురం: నరసాపురంలో వశిష్ఠ గోదావరి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. గత రెండురోజులుగా తగ్గుతూ వచ్చిన నీటిమట్టం మళ్లీ పెరుగుతూ భయపెడుతోంది. ఆదివారం వలంధర్‌రేవులో అడుగున్నర నీటిమట్టం పెరిగింది. వలంధర్‌రేవులో పిండ ప్రధానం షెడ్డు ఫ్లాట్‌ఫామ్ పైకి నీరు చేరింది. రేవులో స్నానాలు చేయకుండా నిషేధించారు. లలితాంబ ఘాట్ పూర్తిగా నీట మునిగింది. పడవల రేవు వద్ద ప్రవాహ ఉధృతి విపరీతంగా పెరిగింది. రేవులో పంటు రాకపోకలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. దీంతో గత 10 రోజుల నుంచి పంటు రాకపోకలు నిలిచిపోయాయి.



నరసాపురం వలంధర్ రేవులో గోదావరి ఉధృతి



సిద్ధాంతంలో నీట మునిగిన కేదారీ ఘాట్

లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతున్న వరద నీరు

నరసాపురం రూరల్: మండలంలో గోదావరి వరద ఉధృతి ఆదివారం మధ్యాహ్నానికి పెరగడం మొదలైంది. ధవళేశ్వరంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో దిగువకు వరద నీరు చేరుతుంది. ముఖ్యంగా నరసాపురం మండంలోని పాతనవరసపురం, కొత్తనవరసపురం యస్టీ కాలనీల్లోని పల్లపు ప్రాంతాలతోపాటు, నరసాపురం పట్టణంలోని ఒకటో వార్డు లాకుపేట ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి ఆదివారం సాయంత్రానికి వరదనీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో నిత్యం గస్తీ ఏర్పాటు చేశారు. పాత నవరసాపురం ఎస్టీకాలనీలో నివాసం ఉంటున్న 79 కుటుంబాలకు సంబంధించిన ప్రాంతంలో కాలనీలోకి నీరు చేరింది. అయితే వరద మరింత పెరిగితే ఉంటే సోమవారం ఉదయానికి వారిని రిలీఫ్ క్యాంప్ ఏర్పాటు చేసి ఏర్పాటు చేసి తీసుకువస్తామని అందుకు సిద్ధంగా ఉండాలని ఆ ప్రాంతవాసులను తహసీల్దార్ ప్రసాద్ అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఎస్టీ కాలనీలోని ప్రజలకు ముందస్తుగా రేషన్ బియ్యం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త నవరసపురం, పాతనవరసపురం, రాజుల్లం గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.



కొత్తనవరసపురం ఎస్టీ కాలనీలోకి వరద నీరు చేరడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



సిద్ధాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవేశించిన వరద నీరు



గోదావరిలో పంటు రాకపోకలు నిలిపేయడం ఒడ్డునే ఉన్న పంటు



యలమంచిలి మండలం కనకాయలంకలో ఇళ్ల చుట్టు చేరిన వరద నీరు



యలమంచిలి మండలం బాడవలో రోడ్లపై ప్రవహిస్తున్న గోదావరి

తగ్గని గోస్తనీ ఉధృతి

ముంపులోనే 7200 ఎకరాలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని గోస్తనీ డ్రెయిన్ ఇంకా పొంగి ప్రవహిస్తుండగా, గొంతేరు, భగ్గేశ్వరం డ్రెయిన్‌లు శాంతించాయి. ఈ నెల 12న ప్రారంభమైన భారీ వర్షాలు కారణంగా ఈ మూడు డ్రెయిన్‌లు పొంగి ప్రవహించడంతో మండలంలోని 18 గ్రామాలకు చెందిన పంట భూములు 15 రోజుల పాటు ముంపులో ఉన్నాయి. అయితే గొంతేరు, భగ్గేశ్వరం డ్రెయిన్‌లలో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఆపరిసర ప్రాంతాలలోని పంట పొలాలు ముంపు నుంచి బయటపడ్డాయి. గోస్తనీ డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో ఆ పరీవాహక ప్రాంతంలోని 7200 ఎకరాలు ముంపులోనే ఉన్నాయి. మండలంలో 18 గ్రామాలకు గాను 12206 ఎకరాలలో వరినాట్లు వేయాల్సి ఉండగా నిన్నటి వరకు 9400 ఎకరాలలో వరినాట్లు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు.

దుర్గంధంతో ఇబ్బంది

గోస్తనీ పరివాహక ప్రాంతంలోని ఎస్.ఇల్లిందలపర్రు, మల్లిపూడి, నత్తారామేశ్వరం, వెలగలవారి పాలెం, పెనుమంట్ర, మాముడూరు, పొలమూరు గ్రామాలకు చెందిన సుమారు 2200 ఎకరాలలో పంటభూములు పూర్తిగా నేటికీ ముంపులోనే కొనసాగుతున్నాయి, గొంతేరు, భగ్గేశ్వరం డ్రెయిన్‌ల పరిధిలో వరినాట్లు ముంపు నుంచి బయట పడటంతో భట్లమగుటూరు, ఆలమూరు, వెలగలేరు. ఓడూరు గ్రామాలలో 130 ఎకరాలలో వరినాట్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనాలో గుర్తించినట్లు తెలిపారు. గోస్తనీ తగ్గితే 2200 ఎకరాలకు మళ్లీ నారుమడులు పోసి, రెండోసారి నాట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోస్తనీ డ్రెయిన్‌లో ఈ నెల 16 వరకు స్థానికంగా కురిసిన వర్షంనీరు ప్రవహించగా, 17 నుంచి గోదావరి నుంచి వచ్చిన ఎర్రని బురద ప్రవహిస్తోంది. అయితే గోస్తనీలో రెండు రోజులుగా దుర్గంధంతో కూడిన నల్ల బరదరనీరు ప్రవహించడంతో గోస్తనీ పరీవాహక ప్రాంతంలో నివసించే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పరిసర ప్రాంతాలలోని చెరువుల నీరు కలుషితం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెనుమంట్ర వద్ద పొంగి ప్రవహిస్తున్న గోస్తనీ డ్రెయిన్



జుత్తిగ వద్ద ముంపులోనే ఉన్న వరినాట్లు, నారుమడులు



ఎస్.ఇల్లిందలపర్రు దానమ్మ గుడి సమీపంలో ముంపులో వరినాట్లు

ముగిసిన కల్యాణోత్సవాలు

నరసాపురం: పట్టణంలోని శ్రీ పాండురంగస్వామి కల్యాణ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు

సబ్ జైలు తనిఖీ



జైలు రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి వరలక్ష్మి

నరసాపురం: నరసాపురం సబ్ జైలును ఆదివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు అదాలత్ నిర్వహించి, ఖైదీలకు అందించే ఆహారం నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేనివారు కోర్టు జైలు విజిటింగ్ లాయర్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. జడ్జి వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

ముగిసిన టీచ్ టూల్ ట్రైనింగ్

పాలకొల్లు సెంట్రల్: టీచ్ టూల్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పరిధిలో ఉన్న పాఠశాలలకు వెళ్లి తరగతి గదుల్లో అభ్యసనం ఎలా జరుగుతుందో? పరిశీలించాలని మండల విద్యాశాఖాధికారి-1 గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన టీచ్ టూల్ ట్రైనింగ్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న 110 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో పరిశీలన చేసిన తరువాత ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో టెస్టులు నిర్వహించి పాసైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆర్ఎస్ఎస్‌విజి శర్మ, పోడూరు ఎంఈఓ విజయకుమార్, యలమంచిలి ఎంఈఓ కృష్ణంరాజు, ఆర్పీలు నరేష్, లక్ష్మీనారాయణ, నరసింహరాజు, మూర్తి పాఠశాల హెచ్ఎం ఝాన్సీ లక్ష్మీబాయి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎక్లీషియా చర్చి నిర్వాహకుడు ప్రభుదేవ

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని ఎక్లీషియా చర్చి 15వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి అధినేత పాస్టర్ చింతా ప్రభుదేవ మాట్లాడుతూ బైబిల్‌లోని వాక్యాలు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవని పేర్కొన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో కలిసిమెలిసి జీవించాలని కోరారు. తొలుత చర్చిలో వార్షికోత్సవ కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాకు వెళ్లే 30 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొక్కుమళ్ల హన్నీ, వర్ధనపు సుధాకర్, వర్ధనపు రాధాఅశోక్, పాలపర్తి పెద్దిరాజు, చింతా లాజరు, గాది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి సారె సమర్పణ

భీమవరం: వాసవీ క్లబ్ చేస్తున్న సేవలతో పాటు సమాజ సేవలో ఆదర్శంగా ఉండాలని క్లబ్ జిల్లా గవర్నర్ వీఎల్ఎన్వీ ప్రసాద్ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మిఠాయిలు, సుమారు 54 రకాలతో ఆషాఢమాస సారె సమర్పించారు. బీవీరాజు పార్కు నుంచి క్లబ్ సభ్యులతో కలిసి సారెతో ఊరేగింపుగా త్యాగరాజ భవనంలో వాసవీ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. మునిసిపల్, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సిమెంట్ బెంచీలు, గోశాలలో దాణా, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముగింపులో భాగంగా కమిటీ సభ్యులు సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు ఇచ్చారు. సీహెచ్ఎస్ఎస్ఎస్. ప్రసాద్, చక్కా శ్రీనివాసరావు, పాబోలు నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఐఐటీ సీటు సాధించిన విద్యార్థులకు సత్కారం

పోడూరు: ఐఐటీ సీటు సాధించిన కవల సోదరులైన ఇద్దరు విద్యార్థులకు జై భీమ్ సేవాసమితి(జేబీఎస్ఎస్) ఆర్థిక ప్రోత్సాహం అందించింది. గుమ్మలూరు గ్రామానికి చెందిన కవల సోదరులు పైడి అభిషేక్, పైడి అఖిల్ ఐఐటీలో వరుసగా 2633, 1906 ర్యాంకులు సాధించి సీట్లు పొందారు. జేబీఎస్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలాబత్తుల రాజశేఖర్, చింతా సంపత్, సభ్యులు ఆదివారం వారి నివాసానికి వెళ్లి అభినందించారు. ఇరువురికీ జేబీఎస్ఎస్ సంస్థ తరఫున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జేబీఎస్ఎస్ గౌరవాధ్యక్షుడు మదన్‌మోహన్, అడ్వైజర్ మానుకొండ సత్యనారాయణ, కోశాధికారి జి.జనార్ధనరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలూరులో ఐఐటీ సీట్లు పొందిన అభిషేక్, అఖిల్‌లను అభినందిస్తున్న జేబీఎస్ఎస్ సభ్యులు

ధ్యానం ద్వారా అనారోగ్యం దూరం

పెనుమంట్ర: ధ్యానం చేయడం ద్వారా ఆలోచన రహిత స్థితిని పొందడం వల్ల అనారోగ్యం నుంచి దూరంగా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్‌మాస్టర్ ఎం రత్నమాల అన్నారు. ఆదివారం పెనుమంట్రలోని ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు నివాసంలోని పిరమిడ్ కేంద్రంలో జరిగిన ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం వల్ల జ్ఞానం, ముక్తి లభిస్తాయని, ధ్యానం ద్వారా అనేక అనుభవాలను పొందగలిగానని శిక్షణ శిబిరంలో సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా రెండు గంటలకు పైగా సభ్యులతో ధ్యానం చేయడంలో మెళకువలను నేర్పారు. అనంతరం ఆమెను సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.



పిరమిడ్ మాస్టర్ రత్నమాలను సత్కరిస్తున్న పిరమిడ్ సభ్యులు

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్: విద్యా వ్యవస్థలో అపరిష్కృతంగా ఎన్నో సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు కోరారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం డీవైఈఓ ఎన్.శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణల వల్ల అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం సడలిపోతోందని, పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు నిచ్చి పనిభారం తగ్గించాలన్నారు. హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రమోషన్లు, బదిలీలు వెంటనే నిర్వహించాలని కోరారు. జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, సభ్యులు కేఎస్‌సీహెచ్ సాయిరామ్, సీహెచ్ కుమార బాబ్జి, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



డీవైఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుగుణరావు మృతి



సుగుణరావు (ఫైల్)

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన డాక్టర్ గోగులమండ సుగుణరావు (68) ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, పీడీ రాజు, ఉంగరాల రమేష్‌నాయుడు, సంగాని బాబూరావు, సీతారామపురం సర్పంచ్ దొండపాటి వెంకట్, పులపర్తి ప్రతాప్ తదితరులు సుగుణరావు మృతిపై సంతాపం తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త వ్యసనాలకు బానిసై వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన వలవల నందిని అదే ప్రాంతానికి చెందిన వలవల సాయిదుర్గ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగిన తరువాత మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన సాయి దుర్గ నిత్యం భార్య నందినిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: పట్టణంలోని నెహ్రూకాలనీకి చెందిన 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఏఎస్సై కె.శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలుడు పేరం సత్యప్రకాష్ తన తాత పెన్ని ఏసుబాబు వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ఏసుబాబు వద్ద కొంతనగదు మాయం కావడంతో సత్యప్రకాష్‌ను మందలించాడు. దీంతో ఆదివారం తెల్లవారుజామున తన పుస్తకాల బ్యాగ్‌తో అదృశ్యమైనట్లు ఏసుబాబు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.